
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రంగారెడ్డి
5 జిల్లా వార్తలు
బుధవారం 31 జనవరి 2024





భర్తీ ఎప్పుడో?

అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల ఖాళీల భర్తీకి కలగని మోక్షం

అత్యధిక ఖాళీలు ఆయా పోస్టులవే
- ఖాళీ ఉన్న చోట ఇన్‌చార్జీలే దిక్కు
- పనిభారంతో అవస్థలు పడుతున్న అంగన్‌వాడీలు



జిల్లాలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల ఖాళీల వివరాలు

అంగన్‌వాడీ కేంద్రాలు	1,600
ఉండాల్సిన అంగవాడీ టీచర్లు	1,600
పనిచేస్తున్న అంగన్‌వాడీలు	1,577
అంగన్‌వాడీ వర్కర్ల ఖాళీలు	25
పనిచేస్తున్న ఆయాలు	1,380
ఖాళీలు	107
ఉండాల్సిన అంగన్‌వాడీ ఆయాలు	1,380

జిల్లాలో అంగన్‌వాడీల పోస్టులు ఎప్పుడు భర్తీ చేస్తారా? అని అర్హులు ఎదురు చూస్తున్నారు. మహిళా, శిశు సంరక్షణలో భాగంగా జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ కేంద్రాల్లో అనేక పోస్టులు ఇంకా ఖాళీగా దర్శనమిస్తున్నాయి. మూడేళ్లుగా ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ టీచర్, ఆయా పోస్టులను భర్తీ చేయకపోవడంతో ఆయా కేంద్రాల పరిధిలోని బాలింతలు, గర్భిణులు, పిల్లలకు ఇబ్బందులు ఎదురౌతున్నాయి. వివిధ కారణాల రీత్యా ఏర్పడిన ఖాళీలను భర్తీ చేయడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఖాళీ అయిన అంగన్‌వాడీ కేంద్రాలను పలుచోట్ల ఇన్‌చార్జిలే నడిపిస్తున్నారు. దీంతో అనేక కేంద్రాల్లో బాలింతలు, గర్భిణులు, పిల్లలకు పౌష్టికాహారం సక్రమంగా అందడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్, జనవరి 30 : జిల్లాలో 27 మండలాలు, 5 రెవెన్యూ డివిజన్లలో 7 ఐసీడీఎస్ ప్రాజెక్టులున్నాయి. వీటి పరిధిలో 1,600 అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటు చేశారు. వీటిలో 1,577 మంది అంగన్‌వాడీ టీచర్లు పనిచేస్తున్నారు. 25 టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అలాగే 1,380 అంగన్‌వాడీ ఆయా పోస్టులు మంజూరు కాగా ప్రస్తుతం 1,273 మంది పనిచేస్తున్నారు. 107 పోస్టులు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. అంగన్‌వాడీ టీచర్ పోస్టులకు సంబంధించి ప్రాజెక్టుల వారీగా పరిశీలిస్తే ఆమనగల్ ఐసీడీఎస్ ప్రాజెక్టులో 232 అంగన్‌వాడీ టీచర్లు ఉండాల్సి ఉండగా 227 మంది మాత్రమే పనిచేస్తున్నారు. చేవెళ్ల ప్రాజెక్టు పరిధిలో 225 టీచర్ పోస్టులకు 250 మంది, హయత్‌నగర్ ప్రాజెక్టు పరిధిలో 181 పోస్టులకూ 178మంది టీచర్లు పనిచేస్తున్నారు. ఇక, ఇబ్రహీంపట్నం ప్రాజెక్టులో 162 టీచర్ పోస్టులకు గాను 158 మంది పనిచేస్తున్నారు. ఇక్కడ నాలుగు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మహేశ్వరం ప్రాజెక్టులో 234మందికి 232 మంది టీచర్లు పనిచేస్తున్నారు. శేరిలింగంపల్లి ప్రాజెక్టులో 220మంది టీచర్లు పనిచేయాల్సి ఉండగా ఇక్కడ కేవలం 217 మంది టీచర్లు మాత్రమే పనిచేస్తున్నారు. షాద్‌నగర్ ప్రాజెక్టు పరిధిలో 316 టీచర్ పోస్టులకు గాను 313 మంది టీచర్లు పనిచేస్తున్నారు.

అంగన్‌వాడీల ఖాళీల వివరాలు ఇలా (ఐసీడీఎస్ ప్రాజెక్టుల వారీగా)

ప్రాజెక్టు	వర్కర్లు	ఆయాలు
ఆమనగల్లు	05	09
చేవెళ్ల	05	20
హయత్‌నగర్	03	11
ఇబ్రహీంపట్నం	04	09
మహేశ్వరం	02	22
శేరిలింగంపల్లి	03	19
షాద్‌నగర్	03	17
మొత్తం	25	107

అధిక ఖాళీల్లో ఆయా పోస్టులే...

జిల్లాలో అంగన్‌వాడీ టీచర్ పోస్టుల కంటే ఆయా పోస్టులే ఎక్కువగా ఖాళీగా కనిపిస్తున్నాయి. ఆమనగల్లులో 160 పోస్టులకు 151 మంది ఆయాలు మాత్రమే పనిచేస్తున్నారు. ఇక, చేవెళ్ల ప్రాజెక్టులో 216మందికి 196 మంది, హయత్‌నగర్ ప్రాజెక్టులో 177మందికి 166 మంది మాత్రమే పనిచేస్తున్నారు. ఇబ్రహీంపట్నంలో 144 పోస్టులకు 135 పోస్టులు మాత్రమే భర్తీ అయ్యాయి. మహేశ్వరంలో 209 మందికి 187 మందే పనిచేస్తున్నారు. ఇక్కడ జిల్లాలోనే అత్యధికంగా 22 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. శేరిలింగంపల్లిలో 212 పోస్టులకు గాను 193 మంది, షాద్‌నగర్‌లో 265 పోస్టులకు 245మంది మాత్రమే పనిచేస్తున్నారు. ఇంకా 17 మంది ఆయా పోస్టులు ఖాళీగా దర్శనమిస్తున్నాయి.

పెరుగుతున్న పనిభారం..

అంగన్‌వాడీ టీచర్‌కు నెలకు 13,650, ఆయాకు 7,800 రూపాయల గౌరవ వేతనంగా అందజేస్తున్నారు. అయితే, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు ఈ వేతనాలు ఏమాత్రం సరిపోవడం లేదంటున్నారు. అదేవిధంగా ఖాళీ అయిన పోస్టులను భర్తీ చేయకపోవడం వల్ల ఉన్న కొద్దిపాటి సిబ్బంది లబ్ధిదారులకు పౌష్టికాహారం సక్రమంగా అందించలేకపోతున్నారు. గ్రామాలు, పట్టణాల్లో ఉండే గర్భిణులు, బాలింతలు, ఐదేళ్లలోపు పిల్లలు రక్తహీనతకు గురికాకుండా, శారీరకంగా బలహీనం కాకుండా ఉండేందుకు గాను అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రతిరోజు పాలు, ఉడకబెట్టిన కోడిగుడ్లతో పాటు ఆకుకూరలు, ఇతరత్రాల కూరలతో కూడుకున్న పౌష్టికాహారాన్ని వీరు అందించాల్సి ఉంది. కానీ, సిబ్బంది సరిపోను లేక ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి వచ్చింది. దీనికి తోడు వీరిని ఆరోగ్య సర్వేలు, ఇతరత్రా సర్వేల బాధ్యతలను ఎక్కువగా వీరికే అప్పగిస్తున్నారు. అలాగే టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్న కేంద్రాల నిర్వహణ బాధ్యతను పక్కగల కేంద్రాల టీచర్లకు అప్పగించడం వల్ల తమపై అదనపు పనిభారం పడుతుందని అంగన్‌వాడీ సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంగన్‌వాడీ సిబ్బందికి సర్వే బాధ్యతలు అప్పగించినప్పుడు కేంద్రాలు కూడా తొందరగానే మూతపడుతున్నాయని. ఇప్పటికైనా ప్రభుత్వం సత్వరమే స్పందించి అంగన్‌వాడీ కేంద్రాల్లో ఏర్పడిన టీచర్, ఆయా పోస్టులను భర్తీ చేయాలని మహిళలు కోరుతున్నారు.

ఇంటర్ ఉంటేనే అంగన్‌వాడీ పోస్టు..
విద్యార్హత పెంచిన కేంద్ర ప్రభుత్వం

కేంద్ర ప్రభుత్వం అంగన్‌వాడీ టీచర్, వర్కర్ పోస్టులకు విద్యార్హతను పెంచింది. ఇప్పటి వరకు పదో తరగతి అర్హతగా ఈ పార్ట్‌టైమ్ నియమకాలు చేపడుతుండగా, ఇకపై కనీసం ఇంటర్మీడియట్ అర్హతగా నిర్ణయించింది. జిల్లాలో ఖాళీగా ఉన్న పోస్టులకు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల తర్వాత భర్తీ చేసేందుకు కసరత్తు చేస్తున్నామని అధికారులు చెబుతున్నారు.



యాచారం మండలం మేడిపల్లిలో మాట్లాడుతున్న కోదండరెడ్డి

‘ధరణి’తో రైతులకు తీవ్ర అన్యాయం

- సమస్యల పరిష్కారానికే భూ న్యాయ శిబిరాలు
- కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ జాతీయ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి

యాచారం, జనవరి 30 : గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ధరణి పోర్టల్‌లో అనేక లోపాలుండటంతో పేద, మధ్య తరగతి రైతులకు తీవ్ర అన్యాయం జరిగిందని కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ జాతీయ ఉపాధ్యక్షుడు ఎం.కోదండరెడ్డి ఆరోపించారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా యాచారం మండలంలోని మేడిపల్లిలో లీగల్ ఎంపవర్‌మెంట్ అండ్ అసిస్టెన్స్ ఫర్ ఫార్మర్స్ సొసైటీ (లీఫ్స్) సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన భూ న్యాయ శిబిరంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ధరణి పోర్టల్ కారణంగా నేటికీ అనేక మంది పేద, మధ్య తరగతి రైతులకు రైతు బంధు సాయం, రైతుబీమా అందలేదన్నారు. ఈ విషయం గత పాలకులకు తెలిసినా ఎందుకు పట్టించుకోలేకపోయారని ప్రశ్నించారు. రైతులు రెండెకరాల సాగు భూమి కొంటే ధరణి పోర్టల్‌లో కేవలం 30 గుంటల భూమి మాత్రమే ఉన్నట్లు నమోదు కావడంతో ఆ రైతులకు ప్రభుత్వ పథకాలేవీ అందలేదన్నారు. ధరణి పూర్తి లోపభూయిష్టంగా ఉన్న కారణంగా రైతులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. త్వరలో ధరణి లోటుపాట్లను సరిచేసి రైతులను ఆదుకుంటామన్నారు. ఫార్మాసిటీ అంశంలో రైతులు ఆందోళన చెందరాదని తెలిపారు. రాష్ట్రంలో నిషేధిత జాబితాలో ఉన్న 18 లక్షల ఎకరాల భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించడం కోసం ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. రైతులను మరింత ఇబ్బందులకు గురిచేసిన బీఆర్‌ఎస్ నాయకులకు పార్లమెంట్ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు భూములు పంచి ఆదుకుందే తప్ప.. పేదల భూములను బడా కంపెనీలకు అప్పజెప్పలేదని బీఆర్‌ఎస్ నాయకులపై ధ్వజమెత్తారు. శిబిరంలో కుర్మిద్ద సర్పంచ్ బి.రాజశేఖర్‌రెడ్డి, నానక్‌నగర్ మాజీ సర్పంచ్ ఎం. వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మహిళా సమాఖ్య భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంకర్, జడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి

మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి

- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, జడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి

షాద్‌నగర్ రూరల్, జనవరి 30: మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించి తమ కుటుంబాలను ముందుకు తీసుకెళ్లాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, జడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి తెలిపారు. ఫరూఖ్‌నగర్ మండలం కాంసాన్‌పల్లిలో నూతనంగా నిర్మించిన మహిళా సమాఖ్య భవనాన్ని మంగళవారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు వృత్తిపరంగా, వ్యక్తిగతంగా అభివృద్ధిని సాధించాలని సూచించారు. ప్రభుత్వం మహిళల అభివృద్ధికి పెద్దపీట వేస్తోందని తెలిపారు. మహిళలు ఆర్థికంగా అబివృద్ధి చెందితేనే మంచి ఫలితాలు వస్తాయని వివరించారు. అనంతరం కడియాలకుంట తండాలో పాఠశాల ప్రహరీని ఎమ్మెల్యే శంకర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీపీ ఖాజా ఇద్రిస్, జడ్పీటీసీ సభ్యుడు వెంకట్రాంరెడ్డి, సర్పంచ్‌లు బసిరెడ్డి పద్మ, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

రేపు సదరం క్యాంపు
ఆన్‌లైన్ స్లాట్స్ విడుదల

రంగారెడ్డి అర్బన్, జనవరి 30 : ఫిబ్రవరి ఒకటో తేదీన ఉదయం 11 గంటలకు మీసేవ సదరం క్యాంపు ఆన్‌లైన్ స్లాట్స్ విడుదల చేయనున్నట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి ప్రభాకర్ తెలిపారు. సదరం క్యాంపునకు హాజరు కావాలనుకునే వారు జిల్లాకు సంబంధించిన వారై ఉండాలని, సూచించిన ఆసుపత్రికి హాజరు కావాల్సి ఉంటుందని చెప్పారు. శారీరక, వినికిడి, మానసిక వికలత్వం కలిగిన దివ్యాంగులు సదరం క్యాంపునకు వెళ్లాల్సి ఉంటుందని చెప్పారు. సదరం క్యాంపు కొండాపూర్‌లోని జిల్లా అసుపత్రి, వనస్థలిపురంలోని ఏరియా ఆసుపత్రిలో ఉంటుందని, మొదటి సారి వచ్చే దివ్యాంగులు, వారి పూర్వపు మెడికల్ రిపోర్ట్స్‌ను, మానసిక వికలాంగులు బోయిన్‌పల్లి ఎన్‌ఐఎంహెచ్, ఎర్రగడ్డ మానసిక చికిత్సాలయం నుంచి ఐక్యూ రిపోర్ట్స్‌ను తీసుకుని రావాలన్నారు. ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ఫొటో తీసుకుని రావాలని ఆయన తెలిపారు.

జలశక్తి అభియాన్ ద్వారా నీటి నిల్వల పెరుగుదల

జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

రంగారెడ్డి అర్బన్, జనవరి 30 : జలశక్తి అభియాన్ ద్వారా నీటి నిల్వల పెరుగుదల సాధ్యమైందని జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ అన్నారు. మంగళవారం జిల్లా సందర్శనకు వచ్చిన జలశక్తి అభియాన్ కేంద్ర నోడల్ బృంద సభ్యులు అంకిత్ మిశ్రా, డిప్యూటీ సెక్రటరీ అంకిత్ విశ్వకర్మ, సైంటిస్ట్‌లను జిల్లా యంత్రాంగం తరపున అదనపు కలెక్టర్ ఆహ్వానించారు. ఈ సందర్భంగా గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె పాల్గొన్నారు. జలశక్తి అభియాన్ ద్వారా జిల్లాలో చేపట్టిన పనులను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి ప్రభాకర్ జలశక్తి అభియాన్ బృందానికి వివరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో జలశక్తి అభియాన్ ద్వారా నీటిని నిల్వ ఉంచే ప్రయత్నంలో ఇంకుడు గుంతలు, కమ్యూనిటీ ఇంకుడు గుంతలు, బోరు బావులు, చెరువులు, చెక్ డ్యామ్‌ల నిర్మాణం చేసుకుని నీటి ఒడిసి పట్టి జిల్లాలో వరి పంటలు, పండ్లు, పూల సాగు చేస్తున్న విధానాన్ని బృందానికి వివరించారు. జిల్లాలో తాగునీటి, సాగునీటికి ఎలాంటి ఇబ్బందులూ లేవని తెలిపారు. జిల్లాలో 558 గ్రామ పంచాయతీలలో హరితహారం కార్యక్రమం ద్వారా మొక్కలు నాటి, నాటిన మొక్కలను సంరక్షణ చేస్తూ పచ్చదనం పెంచుతున్నామని చెప్పారు. గ్రామ నర్సరీలు, పల్లె ప్రకృతి వనాలు, బృహత్ పల్లె ప్రకృతి వనాలు ఏర్పాటు చేసి పచ్చదనం పెంపొందించామని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ సీఈవో దిలీప్‌కుమార్, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి ప్రభాకర్, అడిషనల్ పీడీ నీరజ, వ్యవసాయ శాఖ అధికారి గీతారెడ్డి, ఉద్యానవన శాఖ, అటవీ శాఖ అధికారి సుధాకర్‌రెడ్డి, ఇరిగేషన్ శాఖ అధికారి బన్సీలాల్, మిషన్ భగీరథ అధికారి, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

సమరయోధుల పోరాట స్ఫూర్తిని భావితరాలకు తెలియజేయాలి

- మహాత్మాగాంధీ వర్ధంతిలో కలెక్టర్ శశాంక



నివాళులు అర్పిస్తున్న జిల్లా కలెక్టర్ శశాంక

రంగారెడ్డి అర్బన్, జనవరి 30 : సమరయోధుల పోరాట స్ఫూర్తిని భావితరాలకు తెలియ జేయడం మనందరి బాధ్యతని జిల్లా కలెక్టర్ శశాంక అన్నారు. మంగళవారం జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకుని జిల్లా కలెక్టరేట్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొని స్వాతంత్రోద్యమ అమరులకు శ్రద్ధాంజలి ఘటించారు. అమరుల ఆశయాలను ముందుకు తీసుకెళ్తామనే ధృడ సంకల్పంతో, వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారత స్వతంత్ర పోరాటంలో ఎందరో మహనీయులు తమ ప్రాణాలను పణంగా పెట్టారని, వారి త్యాగాల ఫలితాలను నేడు మనం అనుభవిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, రెవెన్యూ అధికారి సంగీత, కలెక్టరేట్ సిబ్బంది, అన్ని శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మైసిగండి మైసమ్మ హుండీ లెక్కింపు

కడ్తాల్, జనవరి 30: కడ్తాల మండలం మైసిగండి మైసమ్మ దేవాలయంలో మంగళవారం హుండీ ఆదాయాన్ని లెక్కించారు. అలయ ఫౌండర్ ట్రస్టీ రామావత్ సిరోలిపంతూ, ఈవో స్నేహలత, జిల్లా దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ప్రణీత్‌కుమార్ ల సమక్షంలో లెక్కింపు జరిగిరింది. హుండీల ద్వారా 69 రోజులకు గాను రూ. 14,12,231 ఆదాయం లభించినట్లు ఆలయ ఈవో స్నేహలత తెలిపారు. హుండీ ఆదాయాన్ని ఆలయ బ్యాంకు ఖాతాలో జమచేసి ఆలయ అభివృద్ధి, భక్తుల సదుపాయాలకు ఖర్చు చేస్తామని ఈవో తెలిపారు. హుండీ లెక్కింపులో దేవాలయ సిబ్బంది ఆర్‌పీ భాస్కర్, అరుణ్, యాదగిరి, వెంకటరమణ, సంతోష్‌కుమార్, కృష్ణ, చంద్రయ్య, రాములు, దేవేందర్, రమాదేవి, శ్రీనివాసులు, పత్యానాయక్, కృష్ణయ్య, బీబీ చారి, శ్రీను, హర్షవర్ధన్ రెడ్డి, కెనరా బ్యాంక్ అధికారి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



హుండీ ఆదాయం లెక్కింపును పరిశీలిస్తున్న సీరోలి, స్నేహలత

పెండింగ్ బిల్లులు రూ.7కోట్లు

- ‘పట్నం’ మున్సిపాలిటీలో పేరుకుపోయిన బిల్లులు
- లబోదిబోమంటున్న కాంట్రాక్టర్లు



ఇబ్రహీంపట్నం, జనవరి 30: ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో రూ.7 కోట్లకుపైగా పెండింగ్ బిల్లులు పేరుకుపోవడంతో కాంట్రాక్టర్లు లబోదిబోమంటున్నారు. దాంతో కొత్తగా పనులకోసం టెండర్లు పిలిచినా ఎవరూ ముందుకు రావడంలేదు. గత ప్రభుత్వంలో జనరల్ ఫండ్ కింద చేపట్టిన అబివృద్ధి పనులకు సంబంధించి రూ.4 కోట్లకు పైగా మూడేళ్లుగా బిల్లులు పేరుకుపోయాయి. అంతే కాకుండా టీయూఎఫ్ఐడీసీ కింద చేపట్టిన పనులకు సంబంధించి సుమారు రూ.3 కోట్ల మేర బిల్లులు రావాల్సి ఉంది. ఒకేసారి పెద్దమొత్తంలో బిల్లులు పేరుకుపోవడంతో కొత్తగా పనులు తీసుకునేందుకు మరికొంత సమయం పట్టొచ్చని చెప్పొచ్చు. అసలే మున్సిపాలిటీలో రెండేళ్లుగా చైర్‌పర్సన్.. కౌన్సిలర్ల మధ్య ప్రచ్ఛన్న యుద్ధం కొనసాగుతోంది. చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం ప్రకటించి 17మంది కౌన్సిలర్లు అవిశ్వాసం ప్రకటించారు. మొత్తం 24 మంది కౌన్సిలర్లు ఉండగా.. సాధారణ ఎన్నికలకు ముందు బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నుంచి అటూ ఇటూ మారిపోగా.. ప్రస్తుతం బీఆర్‌ఎస్‌కు 15, కాంగ్రెస్ 7, బీజేపీకి ఇద్దరు కౌన్సిలర్లు ఉన్నారు. బీఆర్ఎస్, బీజేపీ కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మాన ప్రతిపై సంతకాలుచేసి కలెక్టర్‌కు అందజేశారు. ప్రస్తుతం బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు గోవాలో సేదతీరుతున్నారు. అవిశ్వాస తేదీ వెలువడితేగానీ వారు తిరిగి రానున్నారు. కౌన్సిల్‌లో ఒకరంటే ఒకరికి పొసగకలేకపోవడంతో ఇక్కడ పనులు చేయాలంటేనే కాంట్రాక్టర్లు భయపడుతున్నారు. పైగా పెండింగ్ బిల్లులు రాబట్టుకోవడానికి మున్సిపల్ కార్యాలయం చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఏదైనా స్పెషల్ ఫండ్ వస్తుందా.. అంటే ఇప్పట్లో ఆ అవకాశం లేదనే చెప్పొచ్చు. టీయూఎఫ్ఐడీసీ కింద మొదటి విడతలో రూ.5 కోట్లతో పనులు తీసుకోగా కోటిన్నర మేర నిధులకు సంబంధించి పనులు పూర్తయ్యాయి. మూడున్నర కోట్లకు సంబంధించి టెండర్ ప్రక్రియ పూర్తయి పరిపాలనా అనుమతులు కూడా వచ్చాయి. ప్రస్తుతం పనులు చేపట్టాల్సి ఉంది. ఇక టీయూఎఫ్ఐడీసీ రెండో విడతలో మరో రూ.5 కోట్లు మంజూరుకాగా వీటిలో కోటిన్నరమేర పనులు పూర్తయ్యాయి. మరో మూడున్నర కోట్లకు సంబంధించి టెండర్ ప్రక్రియ పూర్తయి ఎన్నికల కోడ్ రావడంతో అగ్రిమెంట్ల దశలో ఆగిపోయాయి. కాగా, ఎన్నికల ముందు హెఎండీఏ నిధులకు సంబంధించి రూ.10 కోట్ల పనులకు కౌన్సిల్‌లో తీర్మానం చేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ప్రభుత్వం మారింది గనుక.. కొనసాగుతున్న పనులు పూర్తి చేయనున్నారు తప్పితే.. కొత్తగా పనులకు అనుమతులు వచ్చే అవకాశం ఏ కోశానాలేదు.



సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న మల్‌రెడ్డి రంగారెడ్డి

పేదలందరికీ సంక్షేమ పథకాలు

- ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

మంచాల, జనవరి 30 : నిరుపేదలందరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు కృషి చేస్తామని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. మంచాల మండలంలో మంగళవారం ఆయన రూ.78 లక్షల వ్యయంతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఇందులో భాగంగా లింగంపల్లిలో రూ.20లక్షలతో సీసీ రోడ్లు, రూ.9లక్షలతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, బండలేమూర్‌లో రూ.15 లక్షలతో కమ్యూనిటీ భవనం, రూ.14 లక్షలతో సీసీ రోడ్లు, అంబోత్‌తండాలో రూ.20 లక్షలతో నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్‌రెడ్డి మాట్లాడుతూ గడిచిన పదేళ్లలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రాన్ని నిలువు దోపిడీ చేసి అప్పుల కుప్పగా మార్చిందని విమర్శించారు. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో గ్రామాలను అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తామని చెప్పారు. ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న ఆరు గ్యారెంటీలు అమలు చేసి తీరతామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీపీ జాటోత్ నర్మద లచ్చీరాం, జడ్పీటీసీ మర్రి నిత్య నిరంజన్‌రెడ్డి, సర్పంచులు పెర్క వినోదామూర్తి, కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి, పాత్‌లోత్ మంగ శ్రీనివాస్, రమాకాంత్‌రెడ్డి, కిషన్ నాయక్, ఎంపీటీసీలు మధుసూదన్‌రెడ్డి, కావలి శ్రీనివాస్, పీఏసీఎస్ డైరెక్టర్ జెనిగె వెంకటేష్ యాదవ్, హన్మంత్‌రెడ్డి, వాజీద్, చీమల జంగయ్య యాదవ్, జిలమోని సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్య, వైద్యాభివృద్ధికి చర్యలు



చౌదరిగూడలో పాఠశాల అదనపు గదిని ప్రారంభిస్తున్న జడ్పీచైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి

ఘట్‌కేసర్, జనవరి 30: రాష్ట్రంలో విద్య, వైద్యాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని మేడ్చల్ జడ్పీ చైర్మన్ మలిపెద్ది శరత్ చంద్రా రెడ్డి అన్నారు. చౌదరిగూడలో పాఠశాలలో నూతనంగా రూ.10లక్షల జడ్పీనిధులు రెండు లక్షల పంచాయతీ నిధులతో నిర్మించిన అదనపు గదిని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రధానంగా ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేటుకు దీటుగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో ముందుకెళ్తున్నట్లు తెలిపారు. మేడ్చల్ జిల్లా పరిషత్ నుంచి పాఠశాలల అభివృద్ధికి అత్యధిక నిధులను మంజూరు చేసినట్లు వివరించారు. రానున్న రోజుల్లో ప్రభుత్వ పాఠశాలల్లో మంచి ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు శక్తి వంచన లేకుండా శ్రమించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి, సర్పంచ్ బైరు రమాదేవి రాములుగౌడ్, ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి, పంచాయతీ సభ్యులు, ఉపాధ్యాయులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

కార్యదర్శులు బాధ్యతాయుతంగా పనిచేయాలి



మాట్లాడుతున్న జిల్లా ఏపీడీ స్టీవెన్‌నీల్

యాలాల, జనవరి 30: పంచాయతీ కార్యదర్శులు బాధ్యతాయుతంగా పనిచేయాలని జిల్లా ఏపీడీ స్టీవెన్‌నీల్ అన్నారు. మండలంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం 14వ విడత సామాజిక తనిఖీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 2022 మార్చి1 నుంచి 2023 మార్చి31 వరకు కొనసాగిన ఉపాధి హామి పనులపై ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఏపీడీ మాట్లాడుతూ.. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు ఈజీఎస్ పనులు సక్రమంగా కొనసాగేలా చూడాలని, లేదంటే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. అనంతరం గ్రామాల వారిగి సామాజిక తనిఖీ కార్యక్రమాలను నిర్వహించారు. మండలంలోని అక్కంపల్లి, అన్నసాగర్, ముద్దాయిపేట్, రాస్నం, చెన్నారం, జుంటిపల్లి, బండమీదిపల్లి, కమాల్‌పూర్ గ్రామాలతోపాటు పలు గ్రామాల్లో కొనసాగిన ఉపాధి హామీ పనులపై సమీక్షించారు. ఈ తనిఖీలో ఎలాంటి అవినీతి ఆరోపణలు నెలకొన్నట్లు బయటపడలేదు. రిజిస్టర్‌లో కూలీల హాజరు వేయగా, సంతకాలు చేయలేదని ఆడిటర్లు తెలిపారు. గ్రామాల్లో ఉపాధి హామీ పనులపై నెలకొన్న చిన్న చిన్న తప్పులు ఇంకోసారి కొనసాగరాదని ఏపీడీ వారిని మందలించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బృందం మానిటర్ హజరత్‌అలీ, డీవీవో భార్గవి, ఎంపీడీవో పుష్పలీల, అంబుడ్స్‌మెన్ రాములు, ఏపీవో జనార్దన్, ఎంపీడీవో యాదయ్య, ఏపీడీ సరళకుమారి, పంచాయితీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

రామలింగేశ్వర కళాశాల ప్రిన్సిపాల్‌కు డాక్టరేట్



కామేశ్వరి

కులకచర్ల, జనవరి 30: కులకచర్ల శ్రీ రామలింగేశ్వర డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఆలూరి కామేశ్వరి ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పట్టా అందుకున్నారు. కులకచర్ల మండల కేంద్రంలోని శ్రీరామలింగేశ్వర డిగ్రీ కళాశాలలో ఆమె ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. హైదరాబాద్‌కు చెందిన ఆలూరి కామేశ్వరికి ఉస్మానియా యూనివర్సిటీ హిందీ విభాగం నుంచి డాక్టరేట్ లభించింది. హిందీ విభాగ బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్ డాక్టర్ సంగీతా వ్యాస్ పర్యవేక్షణలో 'కృష్ణా సోబతి ఔర్ మమతా కాలియా కీ కహానీ యోం మే చిత్రిత్ నారీ జీవన్' అంశంపై పరిశోధన చేసి పంపించగా డాక్టరేట్‌కు ఎంపికై డాక్టరేట్ పొందారు. ఆమె ఉన్నత విద్య డిగ్రీ, పీజీ ఎంఫిల్, పీహెచ్‌డీ పూర్తి చేశారు. వీరి తల్లిదండ్రులు ఆలూరి లలితా పరమేశ్వరి భుజంగరావు ప్రముఖ విద్యావేత్త కావడం విశేషం.

పంచాయతీ భవనానికి శంకుస్థాపన

పూడూరు, జనవరి 30: మండల పరిధిలోని మిట్టకంకల్ నూతన పంచాయతీ భవనానికి మంగళవారం శంకుస్థాపన చేశారు. పరిగి ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి పాల్గొని పంచాయతీ భవనానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ సతీష్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఆనందం, మండల అధ్యక్షుడు సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ భవనం ప్రారంభం

ధారూరు, జనవరి 30: మండలంలోని మైలారం గ్రామంలో రూ.20లక్షలతో నిర్మించిన నూతన పంచాయతీ భవనాన్ని ఎంపీపీ విజయలక్ష్మి మంగళవారం ప్రారంభించారు. కాగా గ్రామానికి చెందిన నవాబ్ మీర్ సాజిద్ అలీ ఖాన్ పంచాయతీ నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని విరాళంగా అందజేశారు. ఈస్థలంలో నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని నిర్మించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఎంపీపీ విజయలక్ష్మి మాట్లాడుతూ.. స్థానిక పాలన ద్వారా ప్రజాసమస్యలు, అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ విజయ్‌కుమార్, సర్పంచుల సంఘం మండలాధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, సర్పంచ్ బాబ్యానాయక్, వాలీబాల్ అసోషియేషన్ జిల్లా అధ్యక్షుడు హన్మంత్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

కుష్టువ్యాధిపై ప్రజలకు అవగాహన

దౌల్తాబాద్, జనవరి 30: మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది మంగళవారం కుష్టువ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించారు. వైద్య సిబ్బంది మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించి కుష్టువ్యాధి పట్ల ప్రజలకు అవగాహన కల్పిస్తూ తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వైద్యసేవలపై ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారిణి సౌమ్య, రామకృష్ణ, తుల్జరాం, సిబ్బంది రఫీ, ఏఎన్‌ఎంలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి మంత్రి పర్యటన రద్దు

▸ నిరుత్సాహంలో కాంగ్రెస్ శ్రేణులు



కందుకూరు, జనవరి 30 : మండలంలోని దెబ్బడగూడలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టడానికి మంగళవారం రాష్ట్ర ఐటీ, పరిశ్రమల జిల్లా ఇన్‌చార్జి మంత్రి డి.శ్రీధర్‌బాబు పర్యటన అనివార్య కారణాల శధవల్ల రదద్దయ్యింది. ఆయన పర్యటన సందర్భంగా సర్పంచ్ ఏనుగు శ్రావణి, పీసీసీ సభ్యుడు ఏనుగు జంగారెడ్డి ఉదయం 10గంటల వరకు పూర్తి ఏర్పాట్లు చేశారు. చివరి నిమిషంలో మంత్రి పర్యటన రద్దు కావడంతో కాంగ్రెస్ నేతలు చేసేదేమీ లేక వెనుదిరిగారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మొదటిసారిగా ఇన్‌చార్జి మంత్రి పర్యటన రద్దు కావడంతో పార్టీ శ్రేణులు నిరుత్సాహం వెలిబుచ్చారు.

సమాచారం ఇవ్వకపోవడం విడ్డూరం

అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టడానికి మంత్రి శ్రీధర్‌బాబు వస్తున్నట్లు స్థానిక ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వకపోవడం విడ్డూరంగా ఉందని జడ్పీటీసీ బొక్క జంగారెడ్డి ఆరోపించారు. మంగళవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. దెబ్బడగూడ గ్రామంలో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలకు మంత్రి వస్తున్నట్లు ఏర్పాట్లు చేసినా తమకు సమాచారం ఇవ్వలేదన్నారు. కాగా, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి మండలాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసిందని, స్థానిక కాంగ్రెస్ నాయకులు ఓర్వలేక సోషల్ మీడియాలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని పోస్టులు పెట్టడం సరైంది కాదన్నారు. సబితారెడ్డి చొరవతో డిగ్రీ కళాశాల, ఇంటర్, లా, మెడికల్ కళాశాలలు మంజూరయిన విషయం కాంగ్రెస్ నేతలకు కనిపించడం లేదా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 50రోజుల్లోనే బెదిరింపులకు పాల్పడుతోందని, ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు.

ఐదు నెలల తర్వాత కౌన్సిల్ సమావేశం

▸ ఎక్స్ -అఫీషియో హోదాలో హాజరు కానున్న ఎమ్మెల్యే

▸ ఎజెండాపై కౌన్సిలర్ల అభ్యంతరం



తాండూరు, జనవరి 30: తాండూరు మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం ఐదునెలల తర్వాత బుధవారం జరగనుంది. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఈ సమావేశానికి ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఎక్స్ అఫీషియో సభ్యుడిగా పాల్గొనున్నారు. ఎజెండాలో మున్సిపల్ చైర్‌పర్సన్, కమిషనర్ కార్యాలయాల ఆధునీకరణ మున్సిపల్ ఆవరణలో టైల్స్ ఫ్లోరింగ్ గ్రీనరీ, బల్దియా చుట్టూ అభివృద్ధి పనులు తుదితరానికి సంబంధించి రూ.కోటి కేటాయింపుపై మెజార్టీ కౌన్సిలర్లు అభ్యంతరం చెబుతున్నారు. గతేడాది జనవరి 25న జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో 14, 15వ ఆర్థిక సంఘం నిధులకు సంబంధించి సుమారు రూ.14కోట్ల నిధులను వార్డుకు రూ.50లక్షలు కేటాయిస్తూ ఎజెండా నంబర్ 41లో పొందుపరిచారు. ఈ నిధులు మాకొద్దంటూ మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి వర్గానికి చెందిన బీఆర్ఎస్ కౌన్సిలర్లతో పాటు బీజేపీ, టీజేఎస్ ఇద్దరు కాంగ్రెస్ కౌన్సిలర్లు రాత పూర్వకంగా విజ్ఞప్తి చేశారు. దీంతో నిధుల కేటాయింపు నిలిచిపోయింది. ఈసారి ఎజెండాలో ఈనిధుల కేటాయింపు అంశాన్ని చర్చించలేదు.



కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కేటీఆర్ దిష్టిబొమ్మ దహనం

కడ్తాల్, జనవరి 30: సీఎం రేవంత్‌రెడ్డిపై ఎమ్మెల్యే కేటీఆర్ చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ కాంగ్రెస్ నాయకులు మండిపడ్డారు. కేటీఆర్ వైఖరిని నిరసిస్తూ కడ్తాల మండల కేంద్రంలో మంగళవారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. స్థానిక పాలశీతలీకరణ కేంద్రం ఎదుట హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై నిర్వహించిన కార్యక్రమంలో కడ్తాల మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. పార్టీ కడ్తాల పట్టణాధ్యక్షుడు రాంచందర్‌నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, జిల్లా గిరిజన సేవా సమితి అధ్యక్షుడు హన్మనాయక్, జిల్లా కాంగ్రెస్ నాయకుడు గూడూరు భాస్కర్ రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ వెంకటేశ్, మండల కో-ఆప్షన్‌సభ్యుడు జహంగీర్ బాబాలు హాజరయ్యారు. జాతీయ రహదారిపై కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేసి బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కేటీఆర్ ఇకనైనా తన వైఖరి మార్చుకోకపోతే ప్రజాగ్రహానికి గురికాక తప్పదని శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కేసీఆర్ కాలి గోటికి కూడా సరిపోరని కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు ఆయన అహంకారానికి పరాకాష్ట అని మండిపడ్డారు. అధికారం కోల్పోయిందన్న అక్కసుతో బీఆర్ఎస్ నాయకులు మతిభ్రమించినట్లు ప్రవర్తిస్తున్నారని ఎద్దేవా చేశారు. సీఎం రేవంత్ రెడ్డికి, తెలంగాణ సమాజానికి కేటీఆర్ వెంటనే క్షమాపణలు చెప్పాలని శ్రీనివాస్‌రెడ్డి డిమాండ్‌చేశారు. రాబోవు పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణలో బీఆర్ఎస్ భూస్థాపితం కాకతప్పదని డీసీసీ ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, నాయకులు హన్మనాయక్, వెంకటేశ్, భాస్కర్‌రెడ్డిలు హెచ్చరించారు. మండల సేవాదల్ అధ్యక్షుడు గురిగళ్ల లక్ష్మయ్య, జిల్లా, మండల నాయకులు సత్యం యాదవ్, జహంగీర్‌అలీ, యాదయ్యగౌడ్, మల్లయ్య, రామకృష్ణ, శ్రీను, సజ్జన్‌లాల్, అశోక్, క్యామ రాజేశ్, ఇమ్రాన్‌బాబా, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలు జాతీయ సమైక్యతను పెంపొందిస్తాయి

ఘట్‌కేసర్ రూరల్, జనవరి 30: క్రీడలు జాతీయ సమైక్యతను పెంపెందిస్తాయని మేడ్చల్ జడ్పీ చైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి తెలిపారు. అంకుషాపూర్ ప్రిన్స్‌టన్ కళాశాల ప్రాంగణంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళ డిగ్రీ కళాశాల బుద్వేల్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన 7వ రాష్ట్రస్థాయి క్రీడలు ముగింపు కార్యక్రమానికి ఎమ్మెల్యే మల్లారెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 30 తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళ డిగ్రీ కళాశాలల నుంచి 900 మంది విద్యార్థినులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జడ్పీచైర్మన్ మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని కోరారు. క్రీడావిభాగంలో ప్రభుత్వఉద్యోగాలు లభిస్తాయని తెలిపారు.

క్రీడాకారులు క్రీడాస్ఫూర్తిని చాటాలి: ఎమ్మెల్యే

క్రీడాకారులు క్రీడాస్ఫూర్తిని చాటి ముందుకుసాగాలని మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి తెలిపారు. క్రీడలు ఏకాగ్రతను పెంచుతాయని తెలిపారు. క్రీడాకారులు క్రీడాస్ఫూర్తిని చాటి ముందుకుసాగాలన్నారు. అనంతరం గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల సంస్థ సంయుక్త కార్యదర్శి నిరుప, ప్రాంతీయ కో-అర్డినేటర్ నాగకళ్యాణి, స్పోర్ట్స్ అఫీసర్ రామ్‌లక్ష్మన్, ఘట్‌కేసర్ మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావనిజంగయ్యయాదవ్, ఎంపీటీసీ శోబారాణి, ప్రిన్సిపాల్స్ వెంకటేశ్వర్లు, నిరుపమా, అధ్యాపకులు, పీడీలు, క్రీడాకారులు పాల్గొన్నారు.



గెలుపొందిన క్రీడాకారులకు ట్రోఫీని అందజేస్తున్న జడ్పీ చైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి, ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి

సుగుణ స్టీల్ కంపెనీపై విచారణ

పరిగి, జనవరి 30: మండలంలోని లక్ష్మీదేవిపల్లి శివారులో ఉన్న సుగుణ స్టీల్ కంపెనీలో మంగళవారం వికారాబాద్ ఆర్డీవో ఎ.విజయకుమారి విచారణ జరిపించారు. ఈ ఫ్యాక్టరీ నుంచి వచ్చే కాలుష్యంతో పంటలకు నష్టం వాటిల్లుతోందని డి.ఆంజనేయులు లోకాయుక్తలో ఫిర్యాదు చేశారు. దీంతోపాటు ఇటీవల రైతులు కంపెనీ కాలుష్యంతో పంటలతోపాటు, పొగతో పరిసర గ్రామాల ప్రజలు రోగాల బారిన పడుతున్నారని కంపెనీ ఎదుట ఆందోళనలు చేపట్టారు. దీనిపై వికారాబాద్ ఆర్డీవో విజయకుమారి, జిల్లా వ్యసాయాధికారి గోపాల్‌తోపాటు, ఏవో, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారుల బృందం కంపెనీ పరిసరాలను పరిశీలించారు. కాలుష్యంతో పంటలకు నష్టం వాటిల్లుతున్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. అదేవిధంగా పరిసరాల్లో భూముల రైతులతో మాట్లాడారు. కంపెనీకి వర్తించే వివిధ శాఖల నుంచి వేర్వేరుగా నివేదికలను తీసుకుంటామని ఆర్డీవో తెలిపారు. అన్నిశాఖల నివేదికల సమాచారాన్ని సేకరించి తుది నివేదికను కలెక్టర్‌కు అందజేస్తానని తెలిపారు. అనంతరం కంపెనీ కార్యాలయంలో విచారణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి గోపాల్, తహశీల్దార్ ఆనంద్‌రావు, ఏవో ప్రభాకర్‌రెడ్డి, పీవోబీ అధికారులు, నారాయణపూర్ గ్రామస్తులు పాల్గొన్నారు.

తాండూరు వ్యవసాయ మార్కెట్ పాలకవర్గం రద్దు

▸ హైకోర్టును ఆశ్రయించిన చైర్‌పర్సన్

తాండూరు, జనవరి 30: తాండూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గాన్ని రద్దు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసింది. గతేడాది సెప్టెంబరు 12న మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా వీణా బాధ్యతలు చేపట్టారు. బీఆర్ఎస్ పార్టీ అధికారాన్ని కోల్పోవడం, కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో ఐదు నెలల కాలంలోనే పాలకవర్గం పదవులను కోల్పోవాల్సివచ్చింది. జిల్లా వ్యాప్తంగా 10వ్యవసాయ మార్కెట్లు ఉండగా కొన్ని మార్కెట్లకు పాలకవర్గం పదవీకాలం పూర్తి కాగా మరికొన్ని పాలకవర్గాన్ని రద్దు చేయకుండా కొనసాగిస్తున్నారు. తాండూరు నియోజకవర్గంలో తాండూరు, కోట్‌పల్లి, బషీరాబాద్ వ్యవసాయ మార్కెట్లు ఉండగా కోట్‌పల్లి, బషీరాబాద్ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్లు శాసనసభ ఎన్నికల ముందుగానే కాంగ్రెస్‌లో చేరడంతో వారి పదవులు యథావిధిగా కొనసాగిస్తున్నారు. తాండూరు వ్యవసాయ మార్కెట్‌కమిటీ పాలకవర్గం బీఆర్ఎస్‌లోనే కొనసాగడంతో ఒక్క తాండూరు వ్యవసాయ మార్కెట్ పాలకవర్గాన్ని రద్దు చేశారు. ఈ విషయమై చైర్‌పర్సన్ వీణా హైకోర్టును ఆశ్రయించారు. ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేయకుండా తొలగింపుపై హైకోర్టును ఆశ్రయించారు. 2017-18 సంవత్సరంలో వ్యవసాయ మార్కెట్ చైర్మన్‌గా ఉన్న ఎం.సురేష్ (కాంగ్రెస్) కొనసాగారు. బీఆర్ఎస్ అధికారంలో రాగానే అప్పటి పాలకవర్గాన్ని రద్దుచేయగా హైకోర్టు స్టే ఇచ్చింది. హైకోర్టు స్టేతో కొన్నినెలలు కొనసాగిన తర్వాత అప్పటి ప్రభుత్వం ఆర్డినెన్స్ తీసుకొచ్చి పాలకవర్గం రద్దు చేసింది. ప్రస్తుతం చైర్‌పర్సన్ హైకోర్టును ఆశ్రయించిన తర్వాత కోర్టు కేసును రిజర్వు చేసినట్లు సమాచారం.

పంచాయతీలకు ప్రత్యేక అధికారుల నియామకం

ధారూరు, జనవరి 30: మండలంలోని 32 గ్రామపంచాయతీలకు ప్రత్యేక అధికారులను నియమించినట్లు ఎంపీపీ విజయలక్ష్మి మంగళవారం తెలిపారు. సర్పంచుల పదవీకాలం ముగిసిపోవటంతో వారి స్థానంలో ప్రత్యేక అధికారులను ప్రభుత్వం నియమించిందని ఆమె చెప్పారు. అల్లాపూర్ పంచాయతీకి ఏఈవో కె.త్రైలోక్య, అల్లీపూర్‌కు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శాంత పవార్, ఎస్ఏ జడ్పీహెచ్ఎస్ అంపల్లికి యాదయ్య, అంతారంకు ఏపీవో ఈజీఎస్ సురేష్, చింతకుంటకు ఎంపీవో షఫీ ఉల్లా, ధర్మాపూర్‌కు జడ్పీహెచ్ఎస్ ఎస్ఏ గుణవంత్‌రెడ్డిని నియమించారు. అదేవిధంగా ధారూరుకు తహసీల్దార్ సీ.భువనేశ్వర్, ధారూరు స్టేషన్‌కు ఎంపీడీవో చెన్నారెడ్డి, దోర్నాల్‌కు జడ్పీహెచ్ఎస్ ఎస్ఏ భాస్కర్‌లను ప్రత్యేకాధికారులుగా నియమించారు. ఎబ్బనూర్‌కు ఏఈవో సుజాత, గడ్డమీది గంగారంకు సర్వేయర్ రమేశ్, గట్టేపల్లికి ఆర్ఐ నవీన, గురుదోట్లకు ఏఈవో సంతోష్‌కుమార్, హరిదాసుపల్లికి ఏవో ఝాన్సీ, కేరెల్లికి జడ్పీహెచ్ఎస్ ఎస్ఏ రాంచంద్రయ్య, కొండాపూర్ కలాన్‌కు సీనియర్ అసిస్టెంట్ శివానంద్‌లను నియమించారు. అదేవిధంగా కుమ్మర్‌పల్లికి ఏపీఎం శ్రీనివాస్, కుక్కిందకు ఏఈవో మంజుల, మైలారంకు ఆర్ఐ వీరేశం, మోమిన్‌కలాన్‌కు ఏఈవో మల్లేశం, మోమిన్‌కుర్దుకు డీటీ వి.విజయ్‌లను ప్రత్యేకాధికారులుగా నియమించారు. అదేవిధంగా మున్నూరు సోమారం గ్రామానికి ఈసీ రమేశ్, నాగరం గ్రామానికి హెచ్ఎం నరేందర్‌రెడ్డి, నాగసమందర్‌కు జడ్పీహెచ్ఎస్ ఎస్ఏ ఉదయ్‌కుమార్, నాగ్‌సాన్‌పల్లికి ఏఈవో హరిప్రసాద్, నర్సాపూర్‌కు ఏఈ ట్రాన్స్‌కో వేణుగోపాల్ రెడ్డి, అవుసుపల్లికి సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, పీసీఎం తండాకు సీనియర్ అసిస్టెంట్ వెంకటేశ్, రాజాపూర్‌కు జడ్పీహెచ్ఎస్ ఎస్ఏ మల్లేశం, రాంపూర్‌కు ఏఈవో సంజూరాథోడ్, రుద్రారంకు సీనియర్ అసిస్టెంట్ ఆనంద్‌కుమార్, తరిగోపులకు జడ్పీహెచ్ఎస్ ఎస్ఏ శివ కుమార్‌లను ప్రత్యేకాధికారులుగా నియమించినట్లు ఎంపీపీ వివరించారు.

ఆదిభట్ల కౌన్సిలర్ నిరంజన్‌రెడ్డికి షోకాజ్ నోటీస్



ఆదిభట్ల, జనవరి 30 : కాంగ్రెస్‌కు చెందిన ఆదిభట్ల మున్సిపల్ కౌన్సిలర్ మర్రి నిరంజన్‌రెడ్డికి పార్టీ షోకాజ్ నోటీస్ జారీ చేసింది. మున్సిపాలిటీలో సొంత పార్టీ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం కోసం కౌన్సిలర్లతో కలిసి కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినందుకు క్రమశిక్షణ సంఘం చైర్మన్ జి.చిన్నారెడ్డి మంగళవారం షోకాజ్ నోటీస్ జారీ చేశారు. చైర్‌పర్సన్‌పై ఫిర్యాదు చేయడమే కాకుండా బీజేపీ, బీఆర్ఎస్‌లకు చెందిన కౌన్సిలర్లతో క్యాంపు నడుపుతున్న నేపథ్యంలో మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలని, లేనిపక్షంలో క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని చిన్నారెడ్డి పేర్కొన్నారు. కాగా, క్యాంపులో ఉన్న మిగతా కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లకు సైతం త్వరలో షోకాజ్ నోటీసులు జారీ చేయనున్నట్లు తెలిసింది.



షాద్‌నగర్ రూరల్ : ర్యాలీ ప్రారంభిస్తున్న ఏసీపీ చంద్రశేఖర్

ప్రతీ ఒక్కరు ట్రాఫిక్ రూల్స్ తెలుసుకోవాలి

షాద్‌నగర్ రూరల్/శంషాబాద్, జనవరి 30 : ప్రతీ వాహనదారుడు రోడ్డు నియమ నిబంధనలు తెలుసుకోవాలని ట్రాఫిక్ ఏసీపీ చంద్రశేఖర్ తెలిపారు. రోడ్డు భద్రతా వారోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం షాద్‌నగర్ పట్టణంలోని పోచమ్మ గుడి నుంచి చౌరస్తా వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఏసీపీ మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు తెలియకంతోనే ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయని, అతివేగం ప్రమాదాలకు కారణమవుతోందని తెలిపారు. మద్యం సేవించి ఎట్టి పరిస్థితిలో వాహనం నడుపవద్దన్నారు. 18 ఏళ్లు నిండినవారు విధిగా డ్రైవింగ్ లైసెన్స్ తీసుకోవాలన్నారు. షాద్‌నగర్ ఇన్‌స్పెక్టర్ ప్రతాప్‌లింగం, ట్రాఫిక్ ఎస్సై రవీందర్ నాయక్, ఆర్టీవో బాలూనాయక్ తదితరులు పాల్గొన్నారు. అలాగే శంషాబాద్ మున్సిపల్ కేంద్రంలో ఆర్జీఐఏ ట్రాఫిక్ పోలీసులు పోలీస్‌స్టేషన్ నుంచి మహవీర్ బిల్డర్స్, కోత్వాల్‌గూడ చౌరస్తా, ఆర్బీనగర్, మధురానగర్, సామా ఎన్‌క్లేవ్, బస్టాండు చౌరస్తా, ఎయిర్‌పోర్టు చౌరస్తా, రాళ్లగూడ రోడ్డులో ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. సీఐ రాజు మాట్లాడుతూ ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. ప్రజలు తప్పకుండా ట్రాఫిక్ రూల్స్ పాటించి రోడ్డు ప్రమాదాలు నివారణకు సహకరించాలన్నారు.

నేర పరిశోధనకు సీసీ కెమెరాలు దోహదం



కెమెరాలను ప్రారంభిస్తున్న గోలిశ్రీనివాస్ రెడ్డి

ఆమనగల్లు, జనవరి 30: నేర పరిశోధన, చోరీల నియంత్రణకు సీసీ కెమెరాలు ఎంతగానో దోహదపడుతాయని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. నారాయణ పూర్‌లో నూతనంగా ఏర్పాటుచేసిన సీసీ కెమెరాలను మంగళవారం సీఐ సోమ నర్సయ్య, సర్పంచ్ అంజినాయక్‌లతో కలిసి గోలి ప్రారంభించారు. సింగిల్‌విండో డైరెక్టర్ నాగులునాయక్, కార్యదర్శి, వార్డు సభ్యులు, నాయకులు రమేశ్, సుభాష్, సతీష్, సుమన్ నాయక్ పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరికి కంప్యూటర్ పరిజ్ఞానం ఉండాలి

ఆదిభట్ల, జనవరి 30 : కంప్యూటర్ పరిజ్ఞానం మనిషి జీవితంలో తప్పనిసరి అవసరంగా మారిపోయిందని, దానిపై ప్రతీ ఒక్కరికి అవగాహన, పరిజ్ఞానం ఉండాలని ఇబ్రహీంపట్నం ఎంఈవో వెంకట్‌రెడ్డి అన్నారు. ఆదిభట్ల మున్సిపాలిటీ మంగల్‌పల్లిలోని సీవీఆర్ ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యం మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 60మంది ఉపాధ్యాయులకు మంగళవారం కంప్యూటర్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎంఈవో మాట్లాడుతూ దైనందన జీవితంలో కంప్యూటర్ పరిజ్ఞానం అంతర్భాగమైందని, ప్రతీ వ్యక్తికి కంప్యూటర్‌పై పరిజ్ఞానం ఉండాల్సిందేనన్నారు. సీవీఆర్ విద్యాసంస్థలు రెండేళ్లుగా ప్రభుత్వ ఉపాధ్యాయులకు, విద్యార్థులకు ఉచితంగా కంప్యూటర్ శిక్షణ ఇవ్వడమే కాకుండా కంప్యూటర్లను అందజేయడం ప్రశంసనీయమన్నారు. సీవీఆర్ కళాశాల ప్రిన్సిపల్ రామ్మోహన్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ శివారెడ్డి, హెచ్‌వోడీ లక్ష్మీలు మాట్లాడుతూ ఉపాధ్యాయులు కంప్యూటర్ టెక్నాలజీ నేర్చుకోవడం నైపుణ్యత, విశ్వాసం మరింతగా పెరుగుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలకు ఇప్పటివరకు 35 కంప్యూటర్లు అందించినట్లు తెలిపారు. సీనియర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ రత్నం, పీఆర్టీయూ నాయకులు గోవర్ధన్, పరమేష్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.



కంప్యూటర్ శిక్షణకు హాజరైన ఉపాధ్యాయులు

కేశంపేట ఎస్సైగా కుప్పగిరి లింగం



కేశంపేట, జనవరి 30: కేశంపేట నూతన ఎస్సైగా కుప్పగిరి లింగంను నియమిస్తూ సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మహంతి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. కేశంపేటలో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న బీఎస్ఎస్ వరప్రసాద్‌ను శంషాబాద్ ఆర్జీఐకి బదిలీ చేశారు. వరప్రసాద్ తక్కువ కాలంలో ప్రజలలో మంచి గుర్తింపు తెచుకున్నారు. వివాదాలను చాకచక్యంగా పరిష్కరించడం ద్వారా గుర్తింపు తెచ్చుకున్నారు. కుప్పగిరి లింగం గతంలో చౌదరిగూడ పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐగా విధులు నిర్వహించారు.

తలకొండపల్లి ఎస్సైగా శ్రీకాంత్



తలకొండపల్లి, జనవరి 30 : తలకొండపల్లి ఎస్సైగా ఎ.శ్రీకాంత్ నియమితులయ్యారు. ఈమేరకు సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇక్కడ పనిచేసిన సీహెచ్ శ్రీనును అత్తాపూర్‌కు బదిలీ చేశారు. ఆయన స్థానంలో జగద్గిరిగుట్ట లో పనిచేస్తున్న శ్రీకాంత్‌కు పోస్టింగ్ ఇచ్చారు. బుధవారం ఆయన బాధ్యతలు స్వీకరించనున్నారు.

నూతన సీఐకి నాయకుల సన్మానం



సీఐతో వివిధ పార్టీల నాయకులు, తదితరులు

కందుకూరు, జనవరి 30:నూతనంగా బాధ్యతలు తీసుకున్న కందుకూరు సీఐ మక్బూల్ జానీని మంగళవారం వివిధ పార్టీల నేతలు ఘనంగా సన్మానించారు. ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, బీఆర్ఎస్ ఎస్సీసెల్ మండలాధ్యక్షుడు సామయ్యలు సన్మానించారు. అలాగే కాంగ్రెస్ మండల కో-ఆర్డినేటర్ ఎండీ అఫ్జల్‌బేగ్ ఆధ్వర్యంలో మండల పరిషత్తు కో-ఆప్షన్‌మెంబర్ ఎండీ సులేమాన్, నాయకులు కె.రాణాప్రతాప్‌రెడ్డి, జి.ప్రభాకర్‌రెడ్డి, అంజిరెడ్డి, బుక్క పాండురంగారెడ్డి, సరికొండ జగన్, బొక్క దేవేందర్‌రెడ్డి, కె.సురేందర్, వి.బాబు, ఖాజామోహినుద్దీన్‌లు సన్మానించారు.

బీఆర్ఎస్ పాలనలో పట్టణాలకు దీటుగా పల్లెల అభివృద్ధి



భవనాన్ని ప్రారంభిస్తున్న జడ్పీటీసీ, తదితరులు

ఆమనగల్లు, జనవరి 30: బీఆర్ఎస్ పాలనలో వెనుకబడిన మారుమూల గ్రామాలు, గిరిజన తండాలు వేగవంతంగా అభివృద్ధి సాధించి ప్రజలకు మౌళిక వసతులు ఒనగూడాయని జడ్పీటీసీ అనురాధ పత్యానాయక్ అన్నారు. రాంనుంతలలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా రూ.20లక్షలతో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని మంగళవారం సర్పంచ్ సోనశ్రీనునాయక్, ఎంపీటీసీ సరిత పంతూనాయక్, కడ్తాల జడ్పీటీసీ దశరథ్ నాయక్, పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్‌లతో కలిసి అనురాధపత్యానాయక్ ప్రారంభించారు. సర్పంచ్‌లు లక్ష్మణ్ నాయక్, గోదాదేవి సత్యం, మంజులయాదయ్య, మాజీ మార్కెట్ డైరెక్టర్ రమేశ్‌నాయక్, ఉప సర్పంచ్ సోని, వార్డుసభ్యులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు కందుకూరులో సబితారెడ్డి పర్యటన

కందుకూరు, జనవరి 30 : మండలంలోని మాదాపురం, గూడూరు గ్రామాల్లో పలు అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసేందుకు మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి నేడు(బుధవారం) రానున్నట్లు జడ్పీటీసీ బొక్క జంగారెడ్డి తెలిపారు. బుధవారం ఉదయం 10 గంటలకు మాదాపురం, 10:45గంటలకు గూడూరు గ్రామాల్లో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నట్లు తెలిపారు. మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు, బీఆర్ఎస్ నేతలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఎంపీడీవో వెంకయ్యగౌడ్‌కు సన్మానం

శంకర్‌పల్లి, జనవరి 30 : శంకర్‌పల్లి ఎంపీడీవో జిల్లా స్థాయిలో ఉత్తమ ఎంపీడీవోగా ఎంపిక కావడం అభినందనీయమని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి తొండ రవి అన్నారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయలంలో ఎంపీడీవో వెంకయ్యగౌడ్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్టపడి పనిచేసిన అధికారులు ఉన్నతస్థాయికి ఎదగాలన్నారు. రానున్న రోజుల్లో ఎంపీడీవో వెంకయ్యగౌడ్ జిల్లా నుంచి రాష్ట్రస్థాయిలో అవార్డు అందుకోవాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఏపీ నాగభూషణం తదితరులు ఉన్నారు.



బాపూజీకి ఘన నివాళి

- గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని విగ్రహాలు, చిత్రపటాల వద్ద నివాళులు
- పాల్గొన్న ప్రజాప్రతినిధులు, నాయకులు

ఆమనగల్లు/తలకొండపల్లి/కడ్తాల్ , జనవరి 30 : అహింస, సత్యాగ్రహం, శాంతి ప్రభోదాలనే ఆయుధాలుగా మలుచుకొని దేశ ప్రజలను ఏకతాటిపై నిలిపి స్వరాజ్యాన్ని సాధించిన జాతిపిత మహాత్మాగాంధీ గొప్ప ఆదర్శప్రాయులని ఆమనగల్లు సీఐ వెంకటేశ్వర్లు, ఎక్సైజ్ సీఐ బద్యనాథ్‌చౌహన్, ఎస్ఐ బాల్‌రామ్‌నాయక్‌లు అన్నారు. ఆమనగల్లు పట్టణంలో గాంధీజీ 75వ వర్ధంతి వేడుకలు మంగళవారం జిల్లా ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షుడు వీరబొమ్మ రామ్మోహన్‌ల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆర్యవైశ్య సంఘం నాయకులు మాండం చంద్రశేఖర్, బికుమాండ్ల యాదయ్య, మంచని రాజు, పాపిశెట్టి రాము, బికుమాండ్ల తదితరులున్నారు. కడ్తాల మండల కేంద్రంలో వర్ధంతిని మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, మండల కో-ఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, పీఏసీఎస్ డైరెక్టర్ వెంకటేశ్, కాంగ్రెస్ జిల్లా, మండల నాయకులు హన్మనాయక్, రాంచందర్ నాయక్, గూడూరు భాస్కర్ రెడ్డి, తదితరులున్నారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తలకొండపల్లి మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో గాంధీ వర్ధతిని నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, నాయకులు గాంధీజీ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలువేసి నివాళులర్పించారు.

షాద్‌నగర్ : అహింసను ఆచరించాలంటే గొప్ప నమ్మకం, ధైర్యం కావాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డిలు అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గాంధీజీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. బాబర్‌ఖాన్, ఇబ్రహీం, బాల్‌రాజ్‌గౌడ్, కొత్తూర్ మండలాధ్యక్షుడు హరినాథ్‌రెడ్డి, ఫరూఖ్‌నగర్ మండలాధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

యాచారం : నందివనపర్తి, చింతపట్ల, మాల్, యాచారం గ్రామాల్లో ఆర్యవైశ్య సంఘం నాయకులు, రాజకీయ పార్టీల నాయకులు గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సంతోష్ గుప్త, వెంకటరమణ తదితరులున్నారు.

కందుకూరు : మహాత్మాగాంధీ వర్ధంతి వేడకలను మండల కేంద్రంలో ఘనంగా జరుపుకున్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో సీఐ మక్బూల్ జానీ ఆధ్వర్యంలో బాపూజీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. మండల కేంద్రంలో ఆర్యవైశ్య సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కుంచకూరి వెంకటేశ్వర్లుగుప్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర హ్యూమన్‌రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆంజనేయులు గాంధీ చిత్రపటానికి పూలమాల వేసిన నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు ఎండీ నిజాముద్దీన్, మల్లేష్, సత్తిరెడ్డి, కాళిదాసు, వెంకటరమణ, పాండుగౌడ్, డి.రఘుబాబు, సామ ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఆమనగల్లు : జాతిపిత విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ బాల్‌రామ్ నాయక్



యాచారం : బాపూజీ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు



కందుకూరు : గాంధీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న ఆంజనేయులు, వెంకటేశ్వర్లుగుప్తా

ప్రజల జీవన ప్రమాణాల పెంపే ధ్యేయం

ఆమనగల్లు, జనవరి 30: ప్రజల జీవన ప్రమాణాల పెంపే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం సాహసోపేత నిర్ణయాలు తీసుకుంటుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. రాష్ట్రంలో ప్రతీ కుటుంబానికి ప్రభుత్వ పథకాలు అందాలన్నదే సీఎం రేవంత్‌రెడ్డి ధ్యేయమని అన్నారు. మాడ్గుల మండలంలో మంగళవారం ఎమ్మెల్యే పర్యటించారు. కొత్త బ్రాహ్మణపల్లిలో గ్రామ పంచాయతీ భవనం, పాత బ్రాహ్మణపల్లిలో వైకుంఠ ధామం, పలు అభివృద్ధి పనులను ఎంపీపీ పద్మారెడ్డి, జడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డి, టీపీసీసీ కార్యదర్శి సూదిని రాంరెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కిషన్‌రెడ్డి వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. బ్రాహ్మణపల్లి-ఆర్కపల్లి రోడ్డులో రూ.15 లక్షలతో చేపట్టే బ్రిడ్జి నిర్మాణం పనులకు శంకుస్థాపన చేశారు. మాడ్గుల వాసవి ఫంక్షన్ హాల్‌లో 91 మంది లబ్దిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. సర్పంచ్‌లు లక్ష్మయ్య, జోజమ్మ, జంగయ్య, రవీందర్‌రెడ్డి, రమేశ్‌రెడ్డి, వెంకటేశ్వర్లుగౌడ్, అనురాధ, ఎంపీటీసీలు కిషన్‌రెడ్డి, కొత్త పాండుగౌడ్, లక్ష్మమ్మ, తలకొండపల్లి పీఏసీఎస్ చైర్మన్ కేశవరెడ్డి, సూదిని కొండల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఓం ప్రకాశ్‌రెడ్డి, యాదయ్యగౌడ్, జైపాల్‌రెడ్డి, మర్రెడ్డి, తహసీల్దార్ నిరంజన్, ఎంపీడీవో రాఘవులు, తదితరులున్నారు.



పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

మృతుడి కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

మాడ్గుల : నల్లవారిపల్లికి చెందిన గీత కార్మికుడు జెల్ల తానయ్య మృతిచెందాడు. మృతదేహాన్ని ఎమ్మెల్యే సందర్శించి నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి రూ.5వేలు అందజేశారు. ఎంపీపీ పద్మారెడ్డి, పీసీసీ కార్యదర్శి రాంరెడ్డి, పంచాయతీ రాజ్ చాంబర్ రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్వర్లుగౌడ్, గ్రామ కాంగ్రెస్ నాయకురాలు జయమ్మ, సర్పంచ్ రుద్రాక్ష పార్వతమ్మ, తదితరులున్నారు. తానయ్యగౌడ్ కుటుంబాన్ని గౌడసంఘం నియోజకవర్గ అధ్యక్షుడు అల్లాజీగౌడ్, ఎంపీటీసీ పాండుగౌడ్, మండలాధ్యక్షుడు నర్సింహగౌడ్‌లుపరామర్శించారు. గ్రామ కమిటీ తరఫున రూ.5వేలు, తాలూకా కమిటీ తరఫున రూ.5వేలు అందజేశారు.

ప్రజలకు సేవ చేస్తేనే ఆదరణ : ఎంపీపీ



కందుకూరు: కొత్తగూడ పాలకవర్గాన్ని సన్మానించిన గ్రామస్తులు



తలకొండపల్లి : సర్పంచులను సన్మానించిన ఎంపీపీ నిర్మల, జడ్పీటీసీ వెంకటేష్

తలకొండపల్లి, జనవరి 30 : ప్రజలకు సేవ చేస్తేనే ఆదరిస్తారని తలకొండపల్లి ఎంపీపీ నిర్మల, జడ్పీటీసీ వెంకటేష్‌లు అన్నారు. మంగళవారం మండలానికి చెందిన వివిధ గ్రామాల సర్పంచులను వారు ఘనంగా సత్కరించారు. మాజీ జడ్పీటీసీ నర్సింహ, నాయకులు దశరథ, ఎంపీడీవో శ్రీకాంత్, సూపరింటెండెంట్ శ్యాంసుందర్ రెడ్డి తదితరులున్నారు.

కందుకూరు : ఐదేళ్ల పాలనానుభవంలో ఎన్నో విషయాలు తెలుసుకున్నామని కొత్తగూడ, కందుకూరు గ్రా మాల సర్పంచ్‌లు సాధ మల్లారెడ్డి, ఎస్.శమంతకమణి అన్నారు. ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో పంచాయతీ పాలకవర్గాలను గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. కొత్తూరు ఎంపీటీసీ బి.జ్యోతి, ఉపసర్పంచ్‌లు వెంకటయ్య, పద్మమ్మ, వార్డుసభ్యులు, కో-ఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మొయినాబాద్ రూరల్ : ఐదేళ్ల కాలంలో అందరి సహకారంతో గ్రామాభివృద్ధికి పాటుపడ్డానని అజీజ్‌నగర్ సర్పంచ్ సంధ్య అన్నారు. సర్పంచ్ పదవీ కాలాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా మంగళవారం మండల పరిధిలోని అజీజ్‌నగర్ జీపీ కార్యాలయంలో ఆమెను వివిధ విభాగాల్లో పనిచేసే సిబ్బంది సన్మానించారు. కారోబార్ శ్రవణ్, నాయకులు శ్రీశైలం, కొండల్ రెడ్డి పంచాయతీ సిబ్బంది మహేందర్ ముదిరాజ్, రత్నం తదితరులు ఉన్నారు.



మొయినాబాద్ రూరల్ : సర్పంచ్ సంధ్యను సన్మానిస్తున్న పంచాయతీ సిబ్బంది



జీపీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ రాజు

అప్పోజిగూడ జీపీ భవనం ప్రారంభం

మొయినాబాద్ రూరల్, జనవరి 30: మండల పరిధిలోని అప్పోజిగూడ గ్రామపంచాయతీ కార్యాలయాన్ని మంగళవారం సర్పంచ్ గొర్యంటి రాజు ప్రారంభించారు. నూతనంగా నిర్మించిన భవనం ఎన్ఆర్‌జీఎస్, గ్రామపంచాయతీ నిధులతో చేపట్టారు. కార్యదర్శి జోత్స్న, ఉపసర్పంచ్ సురేష్, వార్డుసభ్యులు హరిత, రాజు, సంధ్య, లత, స్వర్ణలత, కృష్ణ, కోఆప్షన్ సభ్యుడు కృష్ణారెడ్డి, వీరేష్, పద్మ, గ్రామస్తులు పాల్గొన్నారు.

కుష్ఠు నిర్మూలనకు పాటుపడాలి

కడ్తాల్/యాచారం, జనవరి 30: కుష్ఠు వ్యాధి నిర్మూలనకు ప్రభుత్వాలు చేస్తున్న కృషిలో ప్రతీ ఒక్కరు పాలు పంచుకోవాలని ఎంపీటీసీల సంఘం జిల్లా కార్యదర్శి బొప్పిడి గోపాల్, సర్పంచ్ భారతమ్మవితలయ్యగౌడ్‌లు పిలుపునిచ్చారు. కడ్తాల్ మండలం రావిచెడ్‌లో మంగళవారం కుష్ఠు నిర్మూలనపై వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఫిబ్రవరి 13 వరకు నిర్వహించే కుష్ఠు వ్యాధి అవగాహన పక్షోత్సవాల కరపత్రాలు, పోస్టర్లను ఆవిష్కరించారు. ఆశా కార్యకర్తలు మంజుల, అనిత, కార్యదర్శి కృష్ణమాచారి, కారోబార్ కృష్ణయ్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు. కుష్ఠు నిర్మూలనకు ప్రతీ ఒక్కరు చొరవ తీసుకోవాలని యాచారం మండల వైద్యాధికారి డాక్టర్ రాజ్యలక్ష్మి అన్నారు. కుష్ఠు నిర్మూలనపై యాచారంలో అవగాహన కల్పించారు.

'గ్రామీణ భారత్ బంద్'ను విజయవంతం చేయాలి

కేశంపేట, జనవరి 30: కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ, కార్మిక, ప్రజా, రైతాంగ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఫిబ్రవరి 16న తలపెట్టిన దేశ వ్యాప్త గ్రామీణ భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజునాయక్ పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో ఆశ, మధ్యాహ్న భోజన కార్మికులతో సమావేశం నిర్వహించారు. బీజేపీ ప్రభుత్వం పదేళ్లుగా ప్రజలకు చేసిందేమీ లేదన్నారు.

వైద్యశిబిరాలను వినియోగించుకోవాలి

మహేశ్వరం, జనవరి 30 : గ్రామాల్లో నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగపర్చుకొని ఆరోగ్యసమస్యలను పరిష్కరించుకోవాలని ప్రభుత్వ విప్ రామచంద్రనాయక్ అన్నారు. మంగళవారం తుమ్మలూరు రెవెన్యూలోని అవేర్ భగవతిపురంలో అవేర్‌సంస్థ ఆధ్వర్యంలో మెగా ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. కందుకూరు, మహేశ్వరం మండలాల్లోని వివిధ గ్రామాల ప్రజలు హాజరై వైద్యపరీక్షలు చేయించుకున్నారు. అవేర్ సంస్థ అధినేత మాధవన్‌జీ, జేఎన్టీయూ వీసీ కట్ట నర్సింహారెడ్డితో పాటు వివిధ ఆసుపత్రుల వైద్యులు పాల్గొన్నారు.

బాధితులకు పరిహారం

యాచారం, జనవరి 30 : మండలంలోని నందివనపర్తి, తాటిపర్తి శివారులో ఏడాదిన్నర క్రితం హైనాలు దాడిచేసి నందివనపర్తికి చెందిన పార్వతమ్మ, తాటిపర్తికి చెందిన అంజయ్య(అక్కాతమ్ముళ్లు)లకు చెందిన 80 గొర్రెలను హైనాల గుంపు దాడిచేసి చంపేశాయి. దాంతో రెండు కుటుంబాలు వీధినపడ్డాయి. వారికి న్యాయం చేయాలని పత్రికల్లో వచ్చిన కథనాలకు అటవీశాఖ అధికారులు, పోలీసులు స్పందించారు. వివరాలను సేకరించిన అటవీశాఖ అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. దాంతో రాష్ట్ర ప్రభుత్వం బాధితులకు మంగళవారం రూ.7లక్షల 70వేల పరిహారం అందించింది. కాగా, వారికి పరిహారం అందించాలని బీఎన్‌రెడ్డి ట్రస్ట్ చైర్మన్ బిలకంటి శేఖర్‌రెడ్డి ప్రభుత్వ ఉన్నతాధికారులతో మాట్లాడారు. బిలకంటి శేఖర్‌రెడ్డి, సర్పంచ్ ఉదయశ్రీ, అటవీశాఖ అధికారి విజయభాస్కర్‌రెడ్డి, వినోద్, తాటిపర్తి సర్పంచ్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

- **కడ్తాల్** : కడ్తాల గ్రామ పంచాయతీకి చెందిన వరికుప్పల రాములమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. మృతదేహాన్ని డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి సందర్శించి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.4వేలు ఆర్థిక సాయం అందజేశారు. అదేవిదంగా మాజీ వార్డుసభ్యుడు గూడెపు సాలయ్య అనారోగ్యానికి గురై హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. శ్రీనివాస్‌రెడ్డి ఆసుపత్రికి చేరుకొని సాలయ్యను పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకొని మెరుగైన వైద్యమందించాలని సూచించారు. సాలయ్యకు రూ.3వేలు అందజేశారు. పరామర్శించిన వారిలో నాయకులు చేగూరి వెంకటేశ్, బీక్యనాయక్, హన్మనాయక్, జహంగీర్‌బాబా, లక్ష్మయ్య, గూడూరు భాస్కర్ రెడ్డి, సత్యం, జహంగీర్‌అలీ, తదితరులున్నారు.
- **ఆమనగల్లు** : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులను కూలీలు సద్వినియోగం చేసుకొని స్థానికంగా ఉపాధి పొందాలని సర్పంచ్ మంజుల యాదయ్య అన్నారు. రాబోవు వేసవి నేపథ్యంలో ఈజీఎస్ కూలి రేట్లను పెంచాలని కోరారు. చింతలపల్లిలో ఈజీఎస్ పనులను సర్పంచ్ మంజుల యాదయ్య ప్రారంభించారు. కార్యదర్శి శివకుమార్, ఫీల్డ్‌అసిస్టెంట్ రమేశ్ పాల్గొన్నారు.
- **కేశంపేట** : ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ నేడు పాపిరెడ్డిగూడకు వస్తున్నట్లు సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి, ఉప సర్పంచ్ అబ్బి సుందరయ్యలు తెలిపారు. గ్రామంలో నూతనంగా నిర్మించిన జీపీ భవనం ప్రారంభిస్తారని వారు తెలిపారు.
- **కొందుర్గు** : మండల కేంద్రంలో ఛత్రపతి శివాజీ యువజన సంఘం ఆధ్వర్యంలో ఫిబ్రవరి 19, 20 తేదీల్లో నిర్వహించే కబడ్డీ టోర్నమెంట్ కరపత్రాలను మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో యువజన సంఘం అధ్యక్షుడు ఎం.యాదగిరి ఆధ్వర్యంలో వివిధ పార్టీల నాయకులు విడుదల చేశారు. యాదగిరి మాట్లాడుతూ 10వ కబడ్డీ టోర్నమెంట్‌ను ఓపెన్ టు ఆల్, రూరల్ విభాగంలో నిర్వహించడం జరుగుతుందన్నారు.
- **కేశంపేట** : బొదునంపల్లి శివారులోని మీరా సాహెబ్ చెరువు పాటు కాలువతో పాటు అలుగును ధ్వంసం చేసిన జగదీశ్వర్‌రెడ్డి, అతని తండ్రి నర్సింహరెడ్డిపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ మీర్ అజాంఅలీకి గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. అలుగును ధ్వంసం చేసి కబ్జా చేశారని తెలిపారు. చెరువు శిఖంను సైతం వారి పొలంలో కలుపుకున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. తిరుపతయ్య, గణేష్, ఐలయ్య, రమేష్, లింగయ్య, కిష్టయ్య తదితరులున్నారు.
- **కడ్తాల్** : బీటీ రోడ్లు లేని అన్ని గ్రామాలు, తండాలకు రోడ్లు నిర్మించి రవాణా సౌకర్యం కల్పించాలని జడ్పీటీసీ దశరథ్ నాయక్ ప్రభుత్వాన్ని కోరారు. ఎక్వాయిపల్లిలో జడ్పీ నిధుల నుంచి రూ.2లక్షలతో చేపట్టే బస్‌స్టాప్ నిర్మాణ పనులను సర్పంచ్ సుగుణసాయిలు, వైస్ ఎంపీపీ ఆనంద్, ఎంపీటీసీ ఉమావతి బుగ్గయ్యగౌడ్, ఆర్ఎస్ఎస్ ఎం మండలాధ్యక్షుడు వీరయ్యలతో కలిసి ప్రారంభించారు.
- **కడ్తాల్** : సమస్యల పరిష్కారానికి గ్రామ సభలు చక్కటి వేదికలు అని జడ్పీటీసీ దశరథ్‌నాయక్, వైస్ ఎంపీపీ ఆనంద్‌లు అన్నారు. కడ్తాల జీపీ కార్యాలయ సమావేశ భవనంలో సర్పంచ్ అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు. ఐదేళ్లలో కడ్తాల గ్రామ పంచాయతీ పరిధిలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సర్పంచ్ గ్రామ సభలో ప్రజలకు వివరించారు. అనంతరం పాలక మండలి పదవీ కాలం ముగుస్తున్న నేపథ్యంలో సర్పంచ్, ఉప సర్పంచ్ కడారి రామకృష్ణ , వార్డు సభ్యులను దశరథ్ నాయక్, ఆనంద్‌లు పూలమాలలు, శాలువాలతో సత్కరించి అభినందించారు. వార్డుసభ్యులు తదితరులున్నారు.
- **షాబాద్/చేవెళ్ల** : పదో తరగతిలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని షాబాద్ ఎంఈవో శంకర్‌రథోడ్ అన్నారు. మండల కేంద్రంలోని గురుకుల పాఠశాలలో విద్యార్థులకు పరీక్షల నేపథ్యంలో అవగాహన కల్పించారు.
- **చేవెళ్ల** : ఏ నామంతో కొలిచిన భగవంతుడు ఒక్కడే అని లక్ష్యసాధన ఫౌండేషన్ యాత్ర నిర్వాహకులు యోగేష్ ప్రభు అన్నారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో తిరుమల శ్రీవారి పాదయాత్రలో భాగంగా మండల కేంద్రంలోని వివేకానంద జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అయ్యప్ప దేవాలయంలో (నక్షత్రవనం) 27 ఔషధ గుణాలు కలిగిన మొక్కలను నాటారు. ప్రిన్సిపాల్ జైపాల్‌రెడ్డి, ఫౌండేషన్ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, సభ్యులు విద్యార్థులు తదితరులున్నారు.
- **మహేశ్వరం** : పామాయిల్ సాగుతో తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు సాధించవచ్చని మండల ఉద్యాన శాఖాధికారి సౌమ్య తెలిపారు. నాగారంలోని రైతు వేదికలో రైతులకు పామాయిల్ సాగుపై అవగాహన కల్పించారు.
- **కందుకూరు** : తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ నాన్ గెజిటెడ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శిగా నియామకమైన మహ్మద్ గౌస్‌ను ఆర్డీవో సూరజ్‌కుమార్ సన్మానించారు. గౌస్ స్థానిక ఆర్డీవో కార్యాలయంలో విధులు నిర్వహిస్తూనే ఆ సంఘం కార్యకలాపాల్లో చురుకైన పాత్ర పోషిస్తున్నట్లు ఈ సందర్భంగా ఆర్డీవో సూరజ్‌కుమార్ గుర్తుచేశారు.

క్రైం కార్నర్

వరకట్న వేధింపులు.. వివాహిత ఆత్మహత్య

చేవెళ్ల, జనవరి 30 : వరకట్న వేధింపులు తాళలేక వివాహిత అత్తారింట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆలూర్‌లో చోటుచేసుకుంది. ఎస్సై వీరబ్రహ్మం తెలిపిన వివరాల ప్రకారం.. వికారాబాద్ జిల్లా పూడూర్ మండల పరిధిలోని రాకంచెర్లకు చెందిన లలిత కుమార్తె జ్యోతి(23)ని ఏడాదిన్నర క్రితం చేవెళ్ల మండల పరిధిలోని ఆలూర్ గ్రామానికి చెందిన జయగల్ల రాజుకు పెద్దల సమక్షంలో వివాహం చేశారు. ఆరుతులాల బంగారం, ఐదు లక్షల నగదుతో పాటు బైక్ కట్నంగా ఇచ్చారు. అయితే, కొన్ని నెలలుగా అదనపు కట్నం తీసుకురావాలని జ్యోతిపై భర్తతో పాటు అత్తింటివారు వేధింపులకు గురుచేస్తున్నారు. దాంతో జ్యోతి నాలుగు నెలలకే పుట్టింటికి తిరిగి వచ్చింది. మూడు రోజుల క్రితం భర్త, ఇద్దరు మేనమామలు పెద్దమనుసుల సమక్షంలో జ్యోతిని మంచిగా చూసుకుంటామని మాటి ఇచ్చి పుట్టింటి నుంచి అత్తారింటికి తీసుకువచ్చారు. ఈక్రమంలో ఈనెల 29న సాయంత్రం ఇంట్లో ఎవరూలేనిది గమనించి దూలానికి తాడుతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. గమనించిన కుటుంబసభ్యులు పోలీసులకు సమాచారం ఇవ్వగా మృతదేహాన్ని చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళవారం పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. అదనపు కట్నం వేధింపులతోనే తమ కూతురు మృతిచెందిందని జ్యోతి కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వీరబ్రహ్మం తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో తాపీమేస్త్రి..!

ఇబ్రహీంపట్నం, జనవరి 30: ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధి పోచారం వద్ద ఓ వెంచర్‌లో మంగళవారం సాయంత్రం తాపీమేస్త్రీ పని చేసే ఓ వ్యక్తి చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కాగా, ఆర్థిక ఇబ్బందులతోనే అతను ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తోంది. వనస్థలిపురం ఆర్‌కేడీ నగర్‌లో నివాసముంటున్న అంకారావు(45) తాపీమేస్త్రీ. కాగా, మంగళవారం మధ్యాహ్నం ఇంటినుంచి బయలుదేరిన అతను పోచారం శివారు ఏవీసీ వెంచర్‌లో చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అక్కడ అతడి బైక్‌ను గమనించిన గ్రామస్తుడొకరు పోలీసులకు సమాచారమందించారు. మృతదేహాన్ని ఇబ్రహీంపట్నం ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మారయ్య తెలిపారు.

అక్రమంగా మట్టి తవ్వకాలు.. రెండు జేసీబీలు, నాలుగు టిప్పర్లు సీజ్

కందుకూరు, జనవరి 30 : రెవెన్యూ, పోలీసు యంత్రాంగం మంగళవారం నిర్వహించిన దాడుల్లో అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు చేపడుతుండగా.. రెండు జేసీబీ యంత్రాలతో పాటు నాలుగు టిప్పర్లను స్వాధీనం చేసుకున్నట్లు తహసీల్దార్ కె.గోపాల్ తెలిపారు. కొత్తూరులో ఒక జేసీబీతో పాటు రెండు లారీలు, గూడూరులో ఒక జేసీబీతో పాటు రెండు లారీలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

ముచ్చింతల్‌లో ఆర్ఎస్ఎస్ చీఫ్

- చినజీయర్ ఆశీస్సులు తీసుకున్న మోహన్ భగవత్



మోహన్ భగవత్‌కు సీతారాముడు, లక్ష్మణుడి ప్రతిమలను అందజేస్తున్న చినజీయర్

శంషాబాద్ రూరల్, జనవరి 30 : ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ మంగళవారం రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండల పరిధిలోని ముచ్చింతల్‌లో శ్రీరామనగరం దివ్యసాకేతాన్ని సందర్శించారు. అధ్యాత్మిక గురువు చినజీయర్ స్వామిని కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. ఉదయం 9.30గంటలకు దివ్యసాకేతానికి చేరుకున్న భగవత్‌కు వేదపండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం చినజీయర్‌తో కలిసి వేంకటేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు దాదాపు 40 నిమిషాలు చినజీయర్‌తో సమావేశమయ్యారు. స్వామీజీ ఆశీస్సుల కోసమే మోహన్‌భగవత్ ఆశ్రమానికి వచ్చినట్లు ఆయన సన్నిహితులు వెల్లడించారు. మోహన్ భగవత్‌కు మంగళశాసనాలు, తీర్థప్రసాదాలు అందించినట్లు స్వామిజీ తెలిపారు. ఆలయంలో వేదపండితులు ఆర్ఎస్ఎస్ చీఫ్‌కు శాలువా కప్పి, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. మోహన్ భగవత్‌కు చిన జీయర్‌స్వామి వేంకటేశ్వరుడు, సీతారాముడు, లక్ష్మణుడు, ఆంజనేయుడి ప్రతిమలను అందజేశారు.

సంక్షేమ హాస్టళ్లలో సమస్యలు పరిష్కరించండి

చేవెళ్ల, జనవరి 30 : సంక్షేమ హాస్టళ్లలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్ స్పష్టం చేశారు. మంగళవారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో చేవెళ్ల ఆర్డీవో సాయిరాంను కలిసి వినతిపత్రం అందించారు. ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలు పెచ్చులూడిపోయి.. వర్షానికి సంక్షేమ భవనాలు కూలిపోయే స్థితిలో ఉన్నాయని చెప్పారు. వాటి స్థానంలో కొత్తవి నిర్మించాలని డిమాండ్ చేశారు. హాస్టళ్లలో ప్రధానంగా నీటి కొరత ఉందని పేర్కొన్నారు. పెరిగిన ధరలకనుగుణంగా మెస్‌చార్జీలు పెంచాలన్నారు. డివిజన్ అధ్యక్షుడు కె.జైపాల్, కార్యదర్శి శ్రీకాంత్, ఉపాధ్యక్షులు అశోక్, సురేశ్, మండలాధ్యక్షుడు నర్సింహ, కార్యదర్శి అశోక్, నాయకులున్నారు.

ఎన్నికల్లో గెలుపోటములు సహజం

కొందుర్గు, జనవరి 30: ఎన్నికల్లో గెలుపోటములు సహజమని మాజీ ఎమ్మెల్యే అంజ య్య యాదవ్ అన్నా రు. మంగళవారం మం డల కేంద్రంతో పాటు పరిధిలోని పాత ఆగిర్యాల, ఆగిర్యాల, లక్ష్మీదేవిపల్లి, వెంకిర్యాల, తంగెళ్లపల్లి, విశ్వనాథ్‌పూర్, చెరుకుపల్లి, గంగన్నగూడ గ్రామాల్లో కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో గెలిచినా, ఓడినా ప్రజలతోనే ఉంటానని, కార్యకర్తలు ఎన్నికల్లో చాలా కష్టపడ్డారని, పార్టీకి వారే బలమని అన్నారు. వైస్‌ఎంపీపీ రాజేష్‌పటేల్, కొందుర్గు ఎంపీటీసీ ఇస్తారమ్మ మాణయ్య, నాయకులు నారాయణయాదవ్, శ్రీధర్‌రెడ్డి, జగదీశ్వర్‌గౌడ్, రెడ్డి నర్సింలు, ప్రభుదాస్, శ్రీనివాస్, చంద్రశేఖర్, లాలాప్ప, కలాం, సతీష్‌కుమార్, గో వింద్, విజయ్‌కుమార్, ప్రేమ్‌కుమార్, ప్రవీణ్‌పటేల్, కృష్ణయ్యలున్నారు.

'ఎమ్మెల్యేను విమర్శిస్తే సహించం'

చౌదరిగూడ, జనవరి 30: టీఆర్ఎస్ నుంచి బీఆర్ఎస్‌గా పేరు మార్చుకొని తెలివిలేని సన్నాసులవలె షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను విమర్శిస్తే సహించేది లేదని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు చలివేంద్రంపల్లి రాజు బీఆర్ఎస్ నాయకులను హెచ్చరించారు. మంగళవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో పీఏసీఎస్ చైర్మన్ దామోదర్‌రెడ్డి, ఓబీసీ సెల్ తాలుకా అధ్యక్షుడు చంద్రశేఖర్ తదితరులతో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో నియోజకవర్గానికి.. చౌదరిగూడ మండలానికి ఒరగబెట్టిందరేమీ లేదని ధ్వజమెత్తారు. మీడియా ముందు ప్రగల్బాలు పలుకుతున్న బీఆర్ఎస్ నాయకులు వజ్రలింగం, బాబురావు, హఫీజ్ తదితరులపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. వజ్రలింగంకు కాంగ్రెస్ పార్టీయే భిక్ష పెట్టిందని.. ఆ పార్టీనే మర్చిపోయావా అని అన్నారు. ఎమ్మెల్యేను విమర్శిస్తే సహించేది లేదు ఖబర్దార్ బీఆర్ఎస్ నాయకులారా అని హెచ్చరించారు. గ్రామాల్లో కాంగ్రెస్ హయాంలో వేసిన రోడ్లు, ఇందిరమ్మ ఇండ్లు కనిపిస్తున్నాయే తప్ప బీఆర్ఎస్ ప్రభుత్వం ఏం అభివృద్ధి చేసిందో చూపించాలని సవాల్ విసిరారు. ఎంపీటీసీ సత్యనారాయణరెడ్డి, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

మహేశ్వరం శివగంగ ఆలయ కమిటీ చైర్మన్‌గా జంగయ్యముదిరాజ్

మహేశ్వరం, జనవరి 30 : మహేశ్వరం శ్రీశివగంగ రాజరాజేశ్వరాలయ కమిటీ చైర్మన్‌గా మహేశ్వరం గ్రామానికి చెందిన సీనియర్ నాయకుడు గడగూటి జంగయ్యముదిరాజ్‌ను ఎన్నుకుంటున్నట్లు మంగళవారం మహేశ్వరం కాంగ్రెస్ నాయకులు ఏకగ్రీవ తీర్మానం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆలయ కమిటీ పాలకవర్గం మొత్తం బీఆర్ఎస్‌కు చెందిన వారే ఉండగా.. ప్రస్తుతం ఆ పాలకవర్గాన్ని రద్దు చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా అన్ని దేవాలయాలకు నూతన కమిటీలను ఏర్పాటు చేయాలని యోచిస్తోంది. దాంతో శివగంగ ఆలయ కమిటీ చైర్మన్‌గా కొనసాగేందుకు మహేశ్వరం కాంగ్రెస్ పార్టీ నాయకుల్లో ఆశలు మొదలయ్యాయి. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు చైర్మన్ చేతుల మీదుగా నిర్వహించాలని నాయకులు కసరత్తు చేస్తున్నారు.